ఎంపీటీసీకి సన్మానం

ఎంపీటీసీ కంది హేమలత దంపతులను సన్మానిస్తున్న నాయకులు

దండేపల్లి, జూలై 8 : మండలంలోని తాళ్లపేటలో పదవీ కాలం ముగిసిన ఎంపీటీసీ కంది హేమలతను సోమవారం పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో పదవికే విరమణ అని, ప్రజా సేవకు కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది సతీశ్‌కుమార్, కన్నాక జంగు, టీ రాజయ్య, అడాయి కాంతారావు, లింగారావు, కొంపల నర్సయ్య, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

అంకుసాపూర్‌లో పులి పాదముద్రలు

అధికారులు సేకరించిన పులి పాదముద్ర

కాగజ్‌నగర్, జూలై 8 : కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ అటవీ ప్రాంతంలో సోమవారం పెద్దపులి పాదముద్రలను గుర్తించినట్లు ఎఫ్ఆర్వో రమాదేవి తెలిపారు. అంకుసాపూర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నదని, అటవీ శివారు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేంపల్లి అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నదని ఫోన్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు ఎఫ్‌డీవో అప్పలకొండతో పాటు, అటవీ శాఖ సిబ్బంది పాదముద్రల కోసం గాలించారు. అక్కడ పాదముద్రలు కనిపించలేదని, అంకుసాపూర్ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నదని స్పష్టం చేశారు.

శ్రీచైతన్య పాఠశాలలను సీజ్ చేయాలి

నస్పూర్, జూలై 8 : మంచిర్యాల, లక్షెట్టిపేట, మందమర్రి, బెల్లంపల్లిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీ చైతన్య పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని, తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలకు మైదానం లేదని, గ్రిల్స్ లేవని, అర్హత లేని ఉపాధ్యాయులతో బోధిస్తున్నారని, పాఠశాలలోనే యూనిఫాం, బుక్స్, షూ, టై అమ్ముతున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి, వెంటనే శ్రీ చైతన్య పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

పోచమ్మ ఆలయ కమిటీ

దండేపల్లి, జూలై 8 : దండేపల్లి మండలంలోని మేదరిపేట పోచమ్మ తల్లి ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నలిమెల శంకరయ్య, అధ్యక్షుడిగా పత్తిపాక రవితేజ, ఉపాధ్యక్షులుగా ముత్తినేని మల్లేశ్, గడ్డం రాంచందర్, కట్కుం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బండారి రమేశ్, కోశాధికారిగా అంజి, సంయుక్త కార్యదర్శిగా ఎడ్ల రాజన్న, గడ్డం శ్రీనివాస్, మైలారం సత్యనారాయణ, చొప్పదండి రమేశ్, స్వామి, పిట్టల అశోక్, శంకరయ్య, రమేశ్, రామన్న, అరుణ్, బుచ్చన్న, కిషన్, దేవురావును ఎన్నుకున్నారు.

నూతన నియామకం

దండేపల్లి, జూలై 8 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు కార్పొరేషన్ చైర్మన్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దండేపల్లి మండలంలోని అల్లీపూర్ జీపీ పరిధి మోకాసిగూడకు చెందిన కోట్నాక తిరుపతి.. గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈయన గతంలో ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ (ఆదివాసీ విభాగం)గా, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీ అధిష్టానం ఆయన సేవలను గుర్తించి, చైర్మన్‌గా నియమించింది. మారుమూల గ్రామం నుంచి చైర్మన్‌గా ఎన్నికైన తిరుపతిని గ్రామస్తులు, నాయకులు అభినందించారు.

ఆర్థిక సాయం

కాగజ్‌నగర్, జూలై 8 : మండలంలోని గజ్జిగూడకు చెందిన చిలుకూరి అనిత, ఇటీవల తన ముగ్గురు బిడ్డలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ తల్లితోపాటు ఇద్దరు మృతిచెందారు. మరో కూతురు ఐశ్వర్య మంచిర్యాల ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న యువకులు శ్రీకాంత్, ఉమాకాంత్.. సోషల్ మీడియా ద్వారా రూ.40,300 సేకరించి, సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్, జూలై 8 : కోటపల్లి కేజీబీవీలోని సమస్యలను పరిష్కరించాలని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని, బోరుబావి నిర్మించినా మోటర్ ఏర్పాటు చేయలేదని, అలాగే ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలని, మొదటి అంతస్తులో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గతంలో పాఠశాల మరమ్మతులకు కలెక్టర్ భారతీ హోళికేరి రూ.15.5 లక్షలు మంజూరు చేశారని, నిధులు దుర్వినియోగమయ్యాయని, విచారణ జరిపించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

దండేపల్లి, జూలై 8 : దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన బోడకుంట హరికృష్ణ(22) పురుగుల మందు తాగగా, సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు. హరికృష్ణ కొద్ది రోజుల క్రితం కారు డ్రైవర్‌గా పనిచేశాడు. ఈ మధ్య ఏ పనీ లేకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు మందలించడంతో 6వ తేదీన మధ్యాహ్నం మండల కేంద్రంలోని పద్మశాలీ భవన్ సమీపంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి శ్రీధర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విష సర్పాలపై అవగాహన

జైపూర్, జూలై 8 : జైపూర్ కేజీబీవీలో సోమవారం విద్యార్థులకు విష సర్పాలపై అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. మంద మర్రి సింగరేణి స్నేక్ సొసైటీ సహకారంతో వివిధ రకాల పాముల గురించి వివరించారు. విషపూరిత పాములు కాటువేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అటవీ శాఖ డీఆర్వో సాగరిక, స్నేక్ సొసైటీ సభ్యులు రాజు, శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వో రాంసింగ్ పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

దహెగాం, జూలై 8 : దహెగాం మండలం మర్రిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం పుప్పాల మల్లక్క ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఐ కందూరి రాజు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నవీన్ కుమార్ నోట్ బుక్స్‌తో పాటు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నోముల చంద్రశేఖర్, మాజీ సర్పంచులు జర్పుల శంకర్, జర్పుల శ్యామల, నాయకులు పుప్పాల లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

దండేపల్లి, జూలై 8 : దండేపల్లి మండలం వందూర్‌గూడ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని 20 మంది చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, జాబు సుగుణాకర్, పసర్తి సత్తయ్య, కొండు రామన్న, గోళ్ల గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సాగు భూమిలో మొక్కలు నాటొద్దు

- అటవీ అధికారులను అడ్డుకున్న కొండపల్లి రైతులు
- పోలీస్‌స్టేషన్‌లో చర్చలు

పెంచికల్ పేట్ : సీఐ రాంబాబు, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్‌తో మాట్లాడుతున్న పాల్వాయి సుధాకర్‌రావు, గ్రామస్తులు

పెంచికల్ పేట్, జూలై 8 : పెంచికల్‌పేట మండలం కొండపల్లిలో సోమవారం మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్న అటవీ అధికారులను.. సాగు భూమిలో నాట వద్దని గ్రామస్తులు అడ్డుకున్నారు. కొండపల్లిలో సర్వే నంబర్ 119, 137లోని 150 ఎకరాల భూమిని 100 మంది రైతులు 40 ఏళ్లుగా సాగు చేస్తున్నారు. ఈ భూమిపై అటవీ అధికారులు, గ్రామస్తులకు కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతున్నది. పలువురు రైతులపై కేసులు నమోదయ్యాయి. రెండేళ్ల నుంచి ఆ భూమి ఖాళీగానే ఉంటున్నది. సోమవారం ఫారెస్ట్ అధికారులు ఆ స్థలంలో మొక్కలు నాటేందుకు ట్రాక్టర్లతో దుక్కి దున్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అడ్డుకునేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని పోలీస్ స్టేషన్ పిలిపించి ఐదు గంటల పాటు కూర్చోబెట్టారు. సాయంత్రం సీఐ అల్లం రాంబాబు ఆధ్వర్యంలో ఉమ్మడి బెజ్జూర్ మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ రైతులతో చర్చలు జరిపారు. రైతుల సమక్షంలో సర్వే చేయగా.. 119 నంబర్ పరంపోగు భూమి అని, 137 నంబర్ ఫారెస్ట్ ల్యాండ్ అని తేలిందని ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే మొక్కలు నాటుతున్నామని తెలిపారు. దళితులమైన తమకు సాగు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని రైతులతో పాటు మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు విన్నవించగా అధికారులు కుదరదని చెప్పారు. ఈ విషయంపై కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కొమురయ్య, రాజు డీఆర్వో ప్రభాకర్, ఆర్ఐ సురేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు అండగా ఉంటాం

కాగజ్‌నగర్, జూలై 8: కాగజ్‌నగర్ డివిజన్‌లోని పోడు రైతులకు అండగా ఉంటామని బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు అన్నారు. కడంబా గ్రామంలోని పోడు భూములను ఆయన పరిశీలించారు. 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు రైతులను అధికారులు రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కొత్తగా పోడు వ్యవసాయానికి తాము ప్రోత్సహించడంలేదని, అలాగని పాత పోడు రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

ప్రజావాణిలో వినతులు..

నస్పూర్, జూలై 8 : జిల్లాలోని ఆయా మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో.. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దుచేయాలని కోరుతూ అదనపు కలెక్టర్, బెల్లంపల్లి ఆర్డీవోకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ వినతి పత్రం అందించారు. మంచిర్యాల వైద్యకళాశాలలో ఖాళీగా ఉన్న 73 అవుట్‌సోర్సింగ్ పోస్టులను భర్తీ చేసేందుకు శ్రీమహాలక్ష్మి మ్యాన్ పవర్ ప్లేస్‌మెంట్ సర్వీసెస్, ప్రణయన్ హౌస్‌కీపింగ్ సెక్యూరిటీ ఏజెన్సీలు మార్చి నెలలో ఈనాడు పత్రికలో ప్రకటనలు ఇచ్చాయన్నారు. దీంతో జిల్లాలోని 6 వేల మంది దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటి వరకు పోస్టులను భర్తీ చేయలేదని పేర్కొన్నారు. మళ్లీ జూన్ 13న ప్రజా దర్బార్ పత్రికలో పోస్టుల భర్తీ కోసం ప్రకటన ఇచ్చారని, దీంతో అభ్యర్థులు నష్టపోతారని తెలిపారు. వీటిపై విచారణ జరిపించాలని, ఈ ఏజెన్సీలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, వెంకటేశ్, పోశం తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జూలై 8 : కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో.. కోటపల్లి, సర్వాయిపేట, ఎదుల్లబంధం గ్రామాల్లో రోడ్లపైనే పశువులు ఉంటున్నాయని, అత్యవసర సమయంలో రోగులను తీసుకెళ్లడంలో ఇబ్బందవుతున్నదని 108 అంబులెన్స్ ఈఎంటీ, పైలెట్ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ముల్కల సత్యనారాయణ, పశువైద్యాధికారి పవన్‌కుమార్, ఎంఈవో తిరుపతి రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రినాథ్ స్వామి, ఏఈవో వైష్ణవి, ఏపీవో బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి, జూలై 8 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో అనిల్‌కుమార్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించారు. తహసీల్దార్ రమేశ్, పశువైద్యాధికారి అరుణ, ఏపీవో సత్యప్రసాద్, ఎంఐసీ కో ఆర్డినేటర్ సుజాత, సీసీ శివరాం, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట, జూలై 8 : ఆదివాసీ గూడేల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అధికారులు స్పందించాలని కోరారు. గత్రామ్‌పల్లిలోని సబ్ సెంటర్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ గౌరవాధ్యక్షుడు ఆత్రం జంగు, మడావి శంకర్, కోవ లింగు, కోట్నాక భీంరావ్, రెడ్డి బాల్ రాజ్ పాల్గొన్నారు.

స్పందన కరువు..

దహెగాం, జూలై 8 : దహెగాంలో ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలెవరూ రాలేదు. ఉదయం 10:30 గంటలకు వివిధ శాఖల అధికారులు తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. అర్జీల స్వీకరణకు మధ్యాహ్నం 1 గంట వరకు వేచి ఉన్నా ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోలేదు. ప్రజావాణిపై అధికారులు ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవడంతో పాటు, దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం అవుతుందనే నమ్మకం లేకపోవడం వల్లే రాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భీమారం, జూలై 8 : భీమారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు రావాల్సి ఉండగా, కొన్ని శాఖల అధికారులు మాత్రమే వచ్చారు. ప్రజా ఫిర్యాదుల విభాగానికి ప్రజల నుంచి ఆసక్తి కనిపించడం లేదు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపు, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ విద్యాసాగర్, సూపరింటెండెంట్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం : ప్రజావాణిలో ఖాళీగా కూర్చున్న అధికారులు

పలు చోట్ల భారీ వర్షం

సిర్పూర్(టీ) : వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న జడ్పీ పాఠశాల

సిర్పూర్(టీ), జూలై 8 : సిర్పూర్(టీ) మండలంలో సోమవారం సాయంత్రం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. మండలకేంద్రంలోని మేషన్ కాలనీ, ఎస్సీ కాలనీ, గోవింద్‌పూర్, దుబ్బగూడ కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జడ్పీ పాఠశాల మైదానం పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయింది. పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తున్నది.

వాంకిడిలో..

వాంకిడి, జూలై 8 : మండల కేంద్రంలో మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని మురుగునీటి కాలువల్లో పూడిక చేరడంతో పాటు, కాలువలు ఆక్రమణలకు గురవడంతో నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తున్నది.

రెబ్బెనలో..

రెబ్బెన, జూలై 8 : మండలంలో భారీ వర్షం కురిసింది. రైతులు హర్షం వ్యక్తం చేశారు. గోలేటి క్రాస్‌రోడ్ వద్ద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరారు.

మొక్కల పంపిణీ

తాండూర్, జూలై 8 : వన మహోత్సవం కమ్యూనిటీ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా తాండూర్ పంచాయతీ పరిధి కర్షలఘట్టం ఆవాసంలో నాయకులు, సిబ్బందితో కలిసి ఎంపీడీవో పీ శ్రీనివాస్ ఇంటింటికీ హరితహారం మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుగ్గ దేవస్థానం చైర్‌పర్సన్ మాసాడి శ్రీదేవి, నాయకులు సిరంగి శంకర్, ఎండీ ఈసా, ఉపాధిహామీ ఏపీవో నందకుమార్, కార్యదర్శి తపస్‌కుమార్, ఈసీ రమేశ్, టీఏ లక్ష్మి, రమేశ్, అరుణ్, భార్గవ్, ఎఫ్ఏ రాజేశ్వరి, ఉపాధిహామీ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెల్గనూర్ పాఠశాలలో..

దండేపల్లి, జూలై 8 : దండేపల్లి మండలం వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పలు రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త సార్సలలో..

కాగజ్‌నగర్ రూరల్, జూలై 8 : కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సల గ్రామ పంచాయతీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా అధికారులు మొక్కలు నాటారు. జీపీ ప్రత్యేకాధికారి శాంతిప్రియ, కార్యదర్శి మహేశ్, కొత్త సార్సల తాజా మజీ సర్పంచ్ పుల్ల అశోక్, కారోబార్ మచ్చ సురేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ కుందారపు వైకుంఠం, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాంకిడి : వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైఎస్ఆర్ జయంతి

వాంకిడి, జూలై 8 : కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గుర్నులే నారాయణ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, టౌన్ అధ్యక్షుడు అనిల్, జే గణేశ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ దాదాజీ, సీనియర్ నాయకులు సుధాకర్, సంతోష్, నాయకులు సమేల రమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందమర్రి, జూలై 8 : మందమర్రి పట్టణంలోని బీ1 క్యాంప్ కార్యాలయంతో పాటు, మార్కెట్‌లో కాంగ్రెస్ నాయకులు వైఎస్ఆర్ జయంతి నిర్వహించారు. నాయకులు సొతుకు సుదర్శన్, శ్రీనివాస్, సునార్కర్ రాంబాబు, ముడారపు శేఖర్, ఎర్ర రాజు, మంద తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

ఛాంపియన్ దంపతులకు సన్మానం

ఆనంద్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఏఎన్‌ఎస్ ప్రభాకర్ రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 8: ఇటీవల అయోధ్యలో జరిగిన 5కిలో మీటర్ల వాకింగ్ ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని పథకాలు పొందిన బురుగూడ గ్రామానికి చెందిన వైరగడే ఆనంద్‌రావు, ఆయన భార్య శకుంతలను సోమవారం అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఏఎన్‌ఎస్ మాట్లాడుతూ 56 ఏళ్ల వయస్సులో కూడా ఇలా పథకాలు సాధించడం అభినందనీయమని, నేటి యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

బదిలీ ఉపాధ్యాయులకు..

కాసిపేట, జూలై 8 : కాసిపేట మండలం ముత్యంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్ఎం వెంకటేశ్వరస్వామి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు అర్చన, అనసూర్య, బదిలీపై ఇక్కడికి వచ్చిన తిరుపతి, చంద్రశేఖర్‌ను సత్కరించారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, జ్యోతి, పల్లె కృష్ణ గోపాల్ రావు, మాధవి లత పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన, జూలై 8 : తుంగెడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మాజీ ప్రజాప్రతినిధులు, బదిలీ ఉపాధ్యాయులను సన్మానించినట్లు హెచ్ఎం వినయ్ కుమార్ తెలిపారు. మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనందరావు దంపతులు, మాజీ సర్పంచ్ పెంటయ్య, మాజీ ఉప సర్పంచ్ సాయికృష్ణ, బదిలీ ఉపాధ్యాయులు హన్మంత రావు, గోవర్ధన్‌ను సన్మానించి, సేవలు కొనియాడారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, జూలై 8 : జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీన మూగ/చెవిటి, 15న మానసిక వైకల్యం, 22న కంటిచూపు, 27, 30 తేదీల్లో ఎముకల సంబంధిత సమస్యలు ఉన్నవారు సదరం శిబిరానికి సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నిరుపేద ఇంటి నిర్మాణానికి సాయం

రామకృష్ణాపూర్, జూలై 8 : రామకృష్ణాపూర్ పట్టణం విద్యానగర్‌కు చెందిన దివ్యాంగుడు లకుమల్ల నవీన్ ఇల్లు పూర్తిగా శిథిలావస్థలో ఉందని తెలిసి ఆత్మీయచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేల సాయం అందించారు. దివ్యాంగుడైన నవీన్.. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోగా, తన అమ్మమ్మతో విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇల్లు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నదని, దాతలు సాయం అందిస్తే చిన్న సిమెంట్ రేకుల గది కట్టుకుంటానని అపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలోఓ దాత సాయంతో చిన్న గది కట్టుకున్నాడు. మరో దాత ఇంటి ఎదుట రేకులు కొనిచ్చాడు. అయితే అవి ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఇనుప పైపులు, సిమెంట్ స్తంభాల కోసం ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను సంప్రదించాడు. ఈ మేరకు స్పందించిన ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మణ్ రూ.10 వేల చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు భూమేశ్, కోశాధికారి సురేశ్, సభ్యులు, సుభాష్, మల్లేశ్, రమేశ్, కే సంపత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత

చింతలమానేపల్లి, జూలై 8 : కుటుంబ జీవనోపాధి కోసం చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన యువతి మానెపల్లి అనితకు కుట్టు మిషన్ అందజేసినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. స్థానికుల ద్వారా కుటుంబ పరిస్థితి తెలుసుకొని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సంతోష్, ఉద్దల్, కాంత తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

మంచిర్యాల అర్బన్, జూలై 8 : వరకట్నం వేధింపుల కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాని హైదరాబాద్ ఘట్‌కేసర్‌కు చెందిన గుడి కృపానంద్, గుడి పిలిప్స్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ స్పెషల్ జేఎస్ సీఎం ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ నిరోష సోమవారం తీర్పు వెల్లడించారని మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కే నరేశ్ కుమార్ తెలిపారు. 2019లో గుడి కృపానంద్, గుడి పిలిప్స్‌పై వరకట్నం వేధింపుల కింద కేసు నమోదైందని తెలిపారు. కొంత కాలంగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుతిరుగుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎన్డీడబ్ల్యూ టీం వీ రాజేశ్, ఎంఏ నిసార్ అహ్మద్, జీ రామేశ్వర్ రావు సహకారంతో నాన్ బెయిలబుల్ వారెంట్‌పై అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

జిల్లాస్థాయి క్రికెట్ విజేత నస్పూర్

శ్రీరాంపూర్, జూలై 8 : జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ శాంతి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీలో నస్పూర్ జట్టు విజేతగా నిలిచిందని అధ్యక్షుడు నల్ల సతీశ్ తెలిపారు. సోమవారం ఫైనల్‌లో బెల్లంపల్లిపై విజయం సాధించిందని పేర్కొన్నారు. విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు అందజేశారు. ప్రతిభ చూపిన సుధాకర్ మ్యాన్ ఆఫ్ సీరీస్‌గా ఎంపికైనట్లు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గని రవీందర్, కోశాధికారి శ్రీపతి రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకయ్యగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముక్కెర శ్రీనివాస్, నాయకులు భీర్‌పూర్ రఘుపతిరావు, సుధాకర్, నూనె సురేశ్, సాంబారు రాము, లడ్డ సాయి, వేరుగు భానుప్రకాశ్, అభిలాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీలో 10 శాతం రాయితీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 8 : ఆర్టీసీ బస్సుల్లో ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్ సూపర్ లగ్జరీ, లహరీ సర్వీసులకు ఒకేసారి పోనురాను టికెట్ బుక్ చేసుకుంటే తిరుగు ప్రయాణంలో 10 శాతం రాయితీ సౌకర్యం పొందవచ్చని డిపో మేనేజర్ విశ్వనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీలో సురక్షితమైన ప్రయాణం చేయాలని సూచించారు.

మద్యం తాగిన ఆర్టీసీ డ్రైవర్లపై చర్యలు..

విధి నిర్వహణలో మద్యం సేవించిన ఆసి